26నుంచి జియోగ్రాఫికల్ ఇండికేషన్ మహోత్సవ్

దుండిగల్: ఎంఎల్ఆర్ఐటి కళాశాలలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు జియోగ్రాఫికల్ ఇండికేషన్ మహోత్సవ్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వాహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు 50 స్టాల్స్‌లో పలు రకాల వస్తువులను ప్రదర్శిస్తామన్నారు.

నీటిని వృథా చేయరాదు



ఎస్.ఆర్ నాయక్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జీడిమెట్ల: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. మార్చి 23 ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్ నాయక్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అక్షర స్కూల్ విద్యార్థులతో కలిసి ప్లకార్డులు పట్టుకుని నీటి అవసరం దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యావసరాల్లో నీరు ముఖ్యమైనది కావున నీటిని పొదుపుగా వాడుకుని భావి తరాలకు మంచి సందేశాన్ని అందించాలని ఆయన అన్నారు. వాటర్‌వర్క్స్ డీజీఎం రాజేష్, కాలనీ అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.6లక్షల నగదు స్వాధీనం

దుండిగల్: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.6 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గాగిల్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. గుమ్మడిదల ప్రాంతానికి చెందిన ఆంజనేయులు తన కారులో వస్తుండగా ఆపి తనిఖీలు చేశారు. అతని వద్ద డబ్బుకు సంబంధించిన ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో రూ.6 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఫామ్ 12-డీ పంపిణీని పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్: నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. శనివారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు చేపట్టిన ఫామ్ 12-డీ పంపిణి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఇంటి వద్ద నుండే పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఫామ్ 12-డీ ఉపకరిస్తుందని, వాటిని పూరించిన అనంతరం తమ సిబ్బందికి అందజేయాల్సి ఉంటుందన్నారు.

సహజ రంగులతో హోలీ జరుపుకోవాలి


హోలీ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు..

సుభాష్‌నగర్: హోలీ పండుగను సహజమైన రంగులతో జరుపుకోవాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. సూరారం వెంకట్రామ్ నగర్ లోని నార్సిటీ హైస్కూల్లో శనివారం హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోలీ సంబరాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్రకృతి సహజమైన రంగులనే వాడాలని తెలిపారు.

మైనర్‌బాలిక ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: సెల్‌ఫోన్ ఎక్కువ వాడొద్దని తండ్రి మందలించడంతో ఓ మైనర్ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగద్గిరిగుట్టలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీకి చెందిన మహ్మద్ అంజాద్ కుమార్తె (14) చదువులు పక్కనబెట్టి తరచూ సెల్‌ఫోన్ వాడుతుండటంతో శనివారం ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జీడిమెట్ల: ద్విచక్ర వాహనం పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తగలడంతో వెనుక కూర్చున్న యువకుడు బస్సు వెనక టైరు కింద పడి మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హరీష్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మర్గాపూర్ గ్రామానికి చెందిన కొండారి మల్లేశం కుమారుడు కొండారి గణేష్ (23) నగరానికి వచ్చి వరుసకు బాబాయి అయిన వెంకటేశంతో కలిసి ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. శనివారం ఉదయం 9గంటల సమయంలో గణేష్, వెంకటేష్‌లు ద్విచక్ర వాహనంపై సూరారం నుండి బాలానగర్ వైపు వెళ్తున్నారు. జీడిమెట్ల హమాలీ అడ్డ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం కుడి వైపున వెళ్తున్న ఆర్టీసీ బస్సు తగిలింది. దీంతో వాహనం నడుపుతున్న వెంకటేష్ ఎడమ వైపున పడగా గణేష్ కుడి వైపు బస్సు వెనుక టైరు కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైన గణేష్ అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగిన జాతీయ సింపోజియాలు శనివారం ముగిశాయి. ఆయా విభాగాలలో ఇంజినీరింగ్ విద్యార్థులు స్వయంగా నిధులు సేకరించి సదస్సులు, వివిధ రకాల ఎగ్జిబిషన్స్ నిర్వహించారు.

డీలర్..డీలా..!

- బస్తాల్లో తక్కువగా వస్తున్న బియ్యం
- ప్రతి బస్తాకు 3 - 5 కిలోల తరుగు



సుభాష్‌నగర్: పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం లో ప్రతి 50 కిలోల బస్తాలో మూడు నుంచి ఐదు కిలోల వరకు తరుగు వస్తుండటంతో రేషన్ డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి నెలా ఒక్కో దుకాణం వద్ద మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు తరుగు రావడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వాపోతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండలంలోని గండి మైసమ్మ దుండిగల్, బాచుపల్లి రెండు మండలాల్లో 31 షాపులకు గాను 30 వేల కు పైగా తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రెండు మండలాలకు కలిపి 50 నుంచి 60 టన్నుల వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ఈ విషయమై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుండిగల్ మండలంలో ఇద్దరు రేషన్ డీలర్లకు ఒకే నెలలో 9 నుంచి 10 క్వింటాళ్లు తరుగు రావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అదనంగా మూడు క్వింటాలు పంపించి చేతులు దులుపుకున్నారని సాక్షితో వాపోయారు. ఇది ఇలా కొనసాగితే ఇక రేషన్ షాపులు నడపలేమని రేషన్ డీలర్లు కరాకండిగా చెబుతున్నారు.

మేము నష్టపోకపోతే సరి



లాభం మాట దేవుడెరుగు. మేము నష్టపోకపోతే చాలు. ప్రతినెలా నా షాప్‌నకు 140 క్వింటాళ్ల బియ్యం వస్తోంది. అందులో ప్రతి సంచిలో రెండు కిలోల కు పైగా తరుగు ఉంటుంది. ఒక్కోసారి 9 కిలోల బియ్యం తక్కువ వచ్చిన సంఘటనలు ఉన్నాయి. హమాలీ ఖర్చు, షాపు అద్దె, పని వాళ్లకు, కరెంట్ చార్జ్ ఇతర ఖర్చులు పోగా ప్రతి నెలా సొంత జేబులోనుండే డబ్బులు కట్టుకోవాల్సి వస్తుంది. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి రేషన్ డీలర్ల పై భారం పడకుండా చూడాలి.

– శ్రీహరి, మేడ్చల్ జిల్లా మండల్ లేవి స్టాక్ పాయింట్ అధ్యక్షుడు,

ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

నిజాంపేట్: రజకులకు ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జాతీయ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజకలు కోరారు. శనివారం నిజాంపేట్ ఇందిరమ్మకాలనీ ఫేజ్-1లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి కాలనీ అధ్యక్షుడు గురుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో రజకులకు రెండు ఎకరాల భూమిని కేటాయించి దోభీఘాట్, కమిటీ హాళ్ల నిర్మాణాన్ని చేపడతామని ఎమ్మెల్యే వివేకానంద్ మాటిచ్చారన్నారు. దాన్ని వెంటనే అమలు పరిచి రజకుల అభివృద్ధికి సహకరించాలన్నారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దాల అప్పారావు, కాలనీ ఉపాధ్యక్షులు ఎల్లంపాలెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలి

కుత్బుల్లాపూర్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన మహిళా అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఉచిత బస్సు సర్వీసులు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ తదితర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు కేపీ విశాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా కార్యకర్తలతో సమావేశమైన మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్

స్వచ్ఛ ఆటో కార్మికుల ఆందోళన


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులు

నిజాంపేట్: కార్పొరేషన్ అధికారులు జెండా దిమ్మెను తొలగించడంపై స్వచ్ఛ ఆటో కార్మికులు ఆందోళనకు దిగారు.. తెలంగాణ గార్బేజ్ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసుకున్న జెండా దిమ్మెను నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు తొలగించడంతో శనివారం సంఘం అధ్యక్షుడు మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్మికులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, జెండా దిమ్మెకు సైతం పర్మిషన్ తీసుకోవాలా అని ప్రశ్నించారు. ఉపాధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిరక్షిస్తాం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పోరేషన్‌ను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తమ జాగీరుగా మార్చుకుని ప్రభుత్వ భూమి అక్రమణలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని సర్వే నెంబరు 324లో జరుగుతున్న చెరువు భూకబ్జాను పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చెరువు సైతం వదలడం లేదని, ఈ విషయమై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చెరువును పరిరక్షిస్తామని పేర్కొన్నారు.


కబ్జాకు గురవుతున్న చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న హన్మంతరెడ్డి

24 గంటల్లోనే దొంగల అరెస్ట్

జగద్గిరిగుట్ట: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం .. జగద్గిరిగుట్ట జన్మభూమి ప్రాంతానికి చెందిన మక్సూద్ ఈ నెల 17వ తేదిన తన కుటుంబంతో కలిసి బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరిగి 21న ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు దోచుకెళ్లినసంగతి గమనించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూరారం కాలనీ, సుందర్‌నగర్‌కు చెందిన దేరంగుల రవి(22), దేరంగుల నర్సింహ(20)లు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వారిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రవిపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో 26 దొంగతనాల కేసులు నమోదు కాగా నర్సింహపై హత్యా కేసు నమోదైంది. 24 గంటల్లోనే కేసును చేధించిన జగద్గిరిగుట్ట పోలీసులను బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఏసీపీ హన్మంతరావులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం


ఇంకుడు గుంత వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: ప్రపంచంలోని మానవ అభివృద్ధికి నీరు ఎంతో ముఖ్యమని జలమండలి సీజీఎం, కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి అన్నారు, ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా శనివారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అతి ముఖ్యమైన వనరుల నీరు ఒకటని, అంతటి ప్రాముఖ్యం కలిగిన నీటి విలువ గురించి తెలియచెప్పేందుకే ప్రతి ఏటా ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అదే విధంగా ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో అసోసియేషన్, అక్షర స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం లు రాజేష్, అప్పలనాయుడు, విష్ణు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం..

జగద్గిరిగుట్ట: బెల్టుషాపులపై దాడులు చేసిన ఎస్ఓటీ పోలీసులు అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. జగద్గిరిగుట్టలోని లెనిన్ నగర్‌లో సొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి(21), ఉమాదేవి నగర్‌లో రజినీకాంత్(32)లు స్థానికంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన 71లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాగులూరు ప్రాంతంలో పాలకుర్తి కృష్ణ(40) బెల్టు షాపు నిర్వహిస్తుండగా అతని నుంచి 24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు.

బీఆర్ఎస్ నేతల వసూళ్లు మాత్రం ఆగడం లేదు


బీఆర్ఎస్ నాయకుల ఫోన్ రికార్డులను వినిపిస్తున్న సహదేవ్‌యాదవ్

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్న బీఆర్ఎస్ నాయకుల వసూలు మాత్రం ఆగడం లేదని దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. దుండిగల్ మున్సిపల్ 14వ వార్డులో ఇటీవల సీసీ రోడ్డు విషయమై ఓ ప్రజా ప్రతినిధి అనుచరుడు స్థానికంగా ఉన్న ఇళ్ల వాసుల నుండి డబ్బులు వసూలు చేయడంపై సహదేవ్ యాదవ్ శనివారం ఫోన్‌లో ప్రశ్నించారు. సదరు వ్యక్తి అవును వసూలు చేస్తాం .. మాకు ఒక్కరికేనా మున్సిపల్ అధికారులకు కూడా పంచి పెట్టాలని బదులు చెప్పిన.. ఈ మాటలు ప్రస్తుతం వాట్సాప్ గ్రూపులలో స్థానికంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా సహదేవ్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేకున్నా స్థానికంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అందిన కాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు.

టెట్ ఫీజు తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య శనివారం డిమాండ్ చేశారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండగా పెంచిన ఫీజు ఒక్క పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం దారుణమన్నారు. నిరుద్యోగంతో బాధపడుతున్న విద్యార్థులకు ఫీజుల భారం మోపడం సరి కాదని ఫీజులు తగ్గించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ఫీజుల తగ్గింపునకు ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శనివారం వీసీ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద పీహెచ్‌డీ విద్యార్థులు బైఠాయించి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా పీహెచ్‌డీ విద్యార్థి, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. పెంచిన ఫీజులు తగ్గించాలని గత ఆరు నెలలుగా పోరాడుతున్న పట్టించుకోని వీసీ ప్రొ.రవీందర్ ఈ నెల 30వరకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపించడం దారుణమన్నారు. సంపాదించే వయస్సుల్లో పీహెచ్‌డీ చదవడమే ఆర్థిక భారమని గతంలో లభించే స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నెల 26న అన్ని విద్యార్థి సంఘాల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు.

చెత్త డంపింగ్..పొంచి ఉంది ప్రమాదం


సంజయ్‌గాంధీనగర్- గాంధీనగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద

రంగారెడ్డినగర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త డంపింగ్ చేస్తుండటంతో పెను ప్రమాదం పొంచి ఉంది.. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ఇళ్ల నుండి చెత్త ఆటో సేకరణ కార్మికులు వ్యర్థాలను సేకరిస్తున్నా చాలా ప్రాంతాల్లో సర్కిల్ అధికారులు డంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజువారీ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను అక్కడ పోగు చేసి తదనంతరం జీహెచ్ఎంసీ వాహనాల్లో తరలిస్తు వస్తున్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారబోస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోనే పెద్ద ఎత్తున చెత్తను వేయడం ఆందోళన కలిగించే అంశం. పొరబాటున ఎవరైనా చెత్తకు అగ్గిని రగిలిస్తే ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు అంటుకుని పెను ప్రమాదం చోటు చేసుకునే అస్కారం లేకపోలేదు. ఇటీవల నగరంలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తకు నిప్పుపెడితే పేలిపోయిన ఘటన చోటు చేసుకుంది.. ఇప్పటికైనా సంబంధిత అధికారుల మేల్కొని ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో చెత్త వేయకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.


రంగారెడ్డినగర్‌కు వెళ్లేదారిలో

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన నారాయణ, శివకుమార్, అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ కథ ముగిసిందని, ఆ పార్టీ నిరంకుశ విధానాలకు విసుగు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు జేమ్స్, శ్రీధర్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ నాయకుడు గొల్ల జాన్ తదితరులు ఉన్నారు.


కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంజయ్‌గాంధీనగర్ వాసులు

నేడు, రేపు విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్లు

కుత్బుల్లాపూర్: విద్యుత్ బిల్లుల చెల్లింపు కౌంటర్లను ఆది, సోమవారాల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు కొంపల్లి సెక్షన్ ఏఈ వినాయక్‌రాథోడ్ తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో సెలవు దినాల్లో సైతం కౌంటర్లు తెరిచి ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకుని సకాలంలో బిల్లులు చెల్లించాలని ఏఈ సూచించారు.


భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం

కుత్బుల్లాపూర్: దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ యువతకు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీషర్లను గడగడలాడించిన ధీరుడు భగత్‌సింగ్ అని, నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడిచి దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు.


షాపూర్‌నగర్‌లో..


ప్రగతినగర్‌లో..


జగద్గిరిగుట్టలో ..


భగత్‌సింగ్‌నగర్‌లో..